# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-07-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ సంపద సృష్టించి ఆదాయం పెంచడం ద్వారా పేదరికం లేని సమాజాన్ని నిర్మిస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

- ❖ నూతన నేర చట్టాల ద్వారా ఫిర్యాదు దారుల హక్కులు పరిరక్షించబడతాయని కేంద్ర హోంశాఖా మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు.

- ❖ రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అన్నారు.

- ❖ రోడ్డు రవాణా సంస్థలో అవసరమైన సంస్కరణలు చేపట్టి, సంస్థను లాభాల బాటలో నడిపిస్తామని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి మడింపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు.

==========================

రాష్ట్రంలో "ఎన్టీఆర్ భరోసా" పెన్షన్ల పండుగ వచ్చిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరి నియోజకవర్గం, పెనుమాకలో ఈ ఉదయం ఆయన ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను స్వయంగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం మసీదు సెంటరులో నిర్వహించిన "ప్రజావేదిక" కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులు, ప్రజలతో మాట్లాడారు. ఈ ఒక్క నెలలోనే లబ్దిదారులకు 4 వేల 408 కోట్ల రూపాయలను అందిస్తున్నట్టు తెలిపారు. పేదల్ని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయమని, రానున్న ఐదేళ్లలో పెన్షన్ల కింద ఒక లక్షా 65 వేల 500 కోట్ల రూపాయల మొత్తాన్ని ఖర్చు చేయనున్నామని వివరించారు. సంపద సృష్టించి ఆదాయం పెంచుతామని, పెరిగిన ఆదాయాన్ని పేదలకు ఖర్చు చేసి, తద్వారా పేదరికం లేని సమాజాన్ని తీసుకొస్తామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

==========================

నూతన నేర చట్టాలు అత్యాధునిక నేర న్యాయ వ్యవస్థకు దోహద పడతాయని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఈరోజు నుంచి అమలులోకి వచ్చిన నూతన చట్టాల గురించి ఢిల్లీలో ఆయన పాత్రికేయులకు వివరిస్తూ... కొత్త చట్టాలు సత్వర న్యాయానికి, బాధితుల హక్కులకు భరోసా కల్పిస్తాయన్నారు. న్యాయ వ్యవస్థ ఇప్పుడు పూర్తిగా 'స్వదేశీమయిందని,

ఫిర్యాదుదారుల హక్కులు పరిరక్షించబడతాయని స్పష్టం చేశారు. దేశద్రోహ చట్టాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని హోం మంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలోని నూరుశాతం గ్రామాలకు రక్షిత మంచినీటి పథకం అమలు చేయడమే తన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. పిఠాపురం నియోజకవర్గం, గొల్లప్రోలు గ్రామంలోఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఈరోజు ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రక్షిత మంచినీరు, ఉపాధి అవకాశాలు, సాగునీటి కాలువల పూడిక తీత వంటి కార్యక్రమాల ద్వారా ప్రజలకు దగ్గర కావాలనేది తన ఆకాంక్ష అన్నారు. పంచాయితీరాజ్ శాఖలో లోపాలను సరిదిద్ది, పునరుత్తేజం నింపాలని, వ్యవస్థకు జీవం పోయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నం చేస్తామని పవన్ కళ్యాణ్ తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు ప్రయాణికులు, కార్మికులు రెండు కళ్ళని, రవాణా శాఖా మంత్రి మడింపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఈరోజు ఆయన విశాఖలోని మద్దిలపాలెం బస్టాండ్ ఆవరణలో జరిగిన ఆదర్శ ఉద్యోగుల అభినందన సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో అవసరమైన సంస్కరణలు చేపడతామని, సంస్థను లాభాల బాటలో నడిపిస్తామని పేర్కొన్నారు. కార్మికులకు వైద్య బీమా కల్పిస్తామని, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని, అదేవిధంగా విద్యుత్ బస్సులను ప్రవేశపెడతామని చెప్పారు. సంస్థకు లాభాలు చేకూరేలా కార్గో, కొరియర్ సేవలను విస్తరిస్తామన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి... మూడు సూపర్ లగ్జరీ అంతర్ జిల్లాల సర్వీసులను ప్రారంభించడంతో పాటు, ఉత్తమ సేవలందించిన సిబ్బందికి పురస్కారాలను అందజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రతీ సమస్యకు పరిష్కారం చూపాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ అధ్యక్షతన ఈరోజు జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణు చరణ్, సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక, జిల్లా రెవెన్యూ అధికారి జి. కేశవ నాయుడు పాల్గొని, ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ... కాలువలలో పూడికతీత పనులు చేపట్టాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను ప్రతిరోజు శుభ్రపరచాలని, పరిశుభ్రతపై చిన్నారులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఏలూరు జిల్లా నూజివీడు మండలం పోతురెడ్డిపల్లి గ్రామంలో ఈరోజు జరిగిన పింఛను పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పెన్షన్ పెంపుతో పేదల కళ్ళల్లో ఎంతో ఆనందం కనపడుతోందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తామన్నారు. యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తామని, టిడ్కో గృహాలను లబ్దిదారులకు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు... ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడమే కాక రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకువెళ్ళేందుకు కృషి చేస్తున్నారని మంత్రి ఈ సందర్భంగా వివరించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, రాజకీయ పార్టీలు వారి ఎన్నికల ఖర్చుకు సంబంధించిన తుది లెక్కలు సమర్పించాలని అరకు పార్లమెంటరీ నియోజకవర్గ ఎన్నికల వ్యయ పరిశీలకులు గురుకరణ్ సింగ్ సూచించారు. ఈరోజు పార్వతీపురంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ నిశాంత్ కుమార్, సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోబికతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... అభ్యర్థులు రికార్డులు, రిజిస్టర్లను, అకౌంట్ బుక్ లను ఈ నెల 3వ తేదీ లోగా జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకునికి సమర్పించాలన్నారు. సాధారణ ఎన్నికలను జిల్లాలో విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా యంత్రాంగానికి ఆయన అభినందనలు తెలియజేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

శాంతి భద్రతల పరిరక్షణ, నేర నివారణ, మాదక ద్రవ్యాల నిర్మూలన తన లక్ష్యాలని విశాఖ నగర నూతన పోలీస్ కమిషనర్ శంకబ్రత బాగ్చీ అన్నారు. నగర పోలీస్ కమీషనర్ గా ఈరోజు ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... స్థానిక సమస్యల పట్ల తనకు అవగాహన ఉందన్నారు. విశాఖ కేంద్రంగా గంజాయి తరలింపు జరుగుతోందని, దీనిని అరికట్టే బాధ్యతను పూర్తి స్థాయిలో తీసుకుంటామని పేర్కొంటూ... ఆపరేషన్ పరివర్తన మంచి ఫలితాలు ఇచ్చిందన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చే వారిని గౌరవించాలని, వారి ఫిర్యాదులను శ్రద్ధగా విని నమోదు చేసుకోవాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది సంక్షేమం కోసం అవసరమైన చర్యలు తీసుకుంటామని చెబుతూ... అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది. రానున్న రెండు రోజుల్లో రాష్ట్రంలో ఒకటి రెండు చోట్ల తేలికపాటి నుండి మోస్తరు వర్షం లేదా ఉరుములతో కూడిన జల్లులుకురిసే అవకాశముందని పేర్కొంది. ఒకటి లేదా రెండు చోట్ల ఉరుములతో కూడిన మెరుపులు సంభవించే అవకాశముందని, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్ర వ్యాప్తంగా ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను ఈరోజు లబ్ధిదారులకు అందజేశారు. మంగళగిరి నియోజకవర్గం, పెనుమాకలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమంలో పాల్గొనగా... వివిధ జిల్లాల్లో జరిగిన కార్యక్రమాల్లో పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి సాలూరులో జరిగిన కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదవాని ఇంటికి వెళ్ళి, ముఖ్యమంత్రి స్వయంగా పెన్షను అందజేయడం గొప్ప విషయమని, ఆ ఘనత చంద్రబాబు నాయుడుకే దక్కుతుందన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో లబ్ధిదారులకు పెన్షన్లను అందజేసిన కలెక్టర్ సి. నాగమణి... పెన్షన్ డబ్బులను వైద్య ఖర్చులకు, సరైన అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలకు సరైన పరిష్కారం చూపాలని విశాఖ జిల్లా రెవిన్యూ అధికారి కె.మోహన్ కుమార్ అధికారులను ఆదేశించారు. ఈరోజు జరిగిన వినతుల స్వీకరణ కార్యక్రమం అనంతరం ఆయన అధికారులతో మాట్లాడుతూ... ప్రజా సమస్యల పరిష్కార వేదిక అత్యంత ప్రతిష్టాత్మకమైనదని, అధికారులంతా ఈ కార్యక్రమానికి విధిగా హాజరుకావాలన్నారు. ఉమ్మడి జిల్లాల్లో పనిచేసే అధికారులు ఒక వారం ఒక జిల్లాలో, తదుపరి వారం మరో జిల్లాలో హాజరు కావాలని, ఇందులో ఎటువంటి మినహాయింపు ఉండదని స్పష్టం చేశారు. అర్జీదారుల సమస్యలను తమ సమస్యలుగా భావించినపుడే నాణ్యమైన పరిష్కారం చూపగలరని, ప్రతి అర్జీ నిర్ణీత గడువులోగా పరిష్కారం కావాలని అధికారులకు సూచించారు.

==========================

==========================